వద్దన్నవారికి ఇల్లు.. కావాలనోళ్లకు మొండిచెయ్యి.!

- మూసీ బాధితులతోనే డబుల్ ఇండ్ల భర్తీకి సర్కార్ యత్నం
- స్థానిక నిరుపేదల ఆగ్రహం
- తమకు ఇండ్లు ఇవ్వరా.. అంటూ ఫైర్
- ఇండ్ల దరఖాస్తులు అధిక సంఖ్యలో రావడంతో..

కలెక్టరేట్‌లో ప్రత్యేక కౌంటర్

సిటీబ్యూరో, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): డబుల్ బెడ్ రూం ఇండ్ల కేటాయింపు సర్కార్‌కు తలనొప్పిగా మారింది. ఇండ్లు కావాలంటూ గతంలో దరఖాస్తు పెట్టుకున్న వారిని కాదనీ.. ఇప్పుడు మూసీ బాధితులకు ఇండ్లు కేటాయించడంపై స్థానికుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మూసీ పునరుజ్జీవనం– సుందరీకరణ కత్తి మీద సాములా మారుతోంది. పేదోళ్ల నివాసాలను కూల్చి.. వారికి డబుల్ బెడ్ రూం ఇండ్లు కేటాయిస్తున్నప్పటికీ వాళ్లంతా నిరుత్సాహంగానే ఉన్నారు. తమ ఇండ్లు కూల్చడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయిష్టంగానే డబుల్ ఇండ్లల్లో అడుగులు పెడుతున్నారు. సొంత ఇండ్లను లాక్కొని డబుల్ ఇల్లును కేటాయించడం.. ఉమ్మడి ఫ్యామిలీల నివాసాలకు ఉపయోగపడకపోవడంతో వాళ్లంతా సర్కార్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆ ఇండ్లల్లో తిష్ట వేసిన సమస్యలను సైతం అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని వాపోయారు. ఇలాంటి సందర్భంలో సొంత ఇండ్లు కోల్పోయిన వారు.. డబుల్ ఇండ్లలోకి రావడానికి ఆసక్తి చూపడం లేదు. బలవంతంగా వారికి ఇల్లు కేటాయించి తరలిస్తున్నారు. మరోవైపు హైదరాబాద్‌లో తమకు ఇల్లు కావాలంటూ కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తులు అందిస్తున్నారు. దరఖాస్తులు అధిక సంఖ్యలో రావడంతో కలెక్టరేట్‌లో గృహ నిర్మాణ శాఖలో ప్రత్యేక కౌంటర్ తెరిచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇది వరకు ఇచ్చిన దరఖాస్తులే లక్షల్లో ఉన్నాయి. ఇప్పటికీ దరఖాస్తులు వెల్లువలా వస్తున్నాయి. దీంతో అర్హులు చాలా మంది ఉన్నారని గుర్తించినప్పటికీ డబుల్ బెడ్ రూంలను స్థానికంగా ఉన్న అర్హులను కాదనీ.. మూసీ బాధితులకు కేటాయించడంపై స్థానిక ప్రజలు, రాజకీయ నాయకుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇటువంటి గందరగోళ మూసీ పరిస్థితులు రేవంత్ సర్కార్‌కు ఊపిరి సలపనివ్వడం లేదు. ఎలాగైనా మూసీ నిర్మాణాలు కూల్చి ప్రాజెక్టు పూర్తి చేస్తామని చెబుతున్న సీఎం రేవంత్ రెడ్డికి అటు మూసీ బాధితులు, ఇటు స్థానిక జనం నుంచి ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల మధ్య మూసీ నిర్మాణాల కూల్చివేతలు ఎలాంటి మలుపు తీసుకుంటాయోనని నిపుణులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

భావ కవిత్వ వైతాళికుడు దేవులపల్లి కృష్ణ శాస్త్రి

దేవులపల్లి కృష్ణశాస్త్రి చిత్ర పటానికి నివాళులర్పించిన వంశీరామ రాజు

ముషీరాబాద్, నవంబర్ 1: భావ కవిత్వ వైతాళికుడు దేవులపల్లి కృష్ణ శాస్త్రి అని వంశీ సంస్థల అధినేత వంశీరామ రాజు అన్నారు. చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో భాగంగా శుక్రవారం కవి దేవులపల్లి కృష్ణ శాస్త్రి సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో వంశీ రామరాజు ముఖ్య అతిథిగా పాల్గొని దేవులపల్లి కృష్ణ శాస్త్రి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్‌బీ రామ్, శ్రీలత వర్మ, శంకర్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంబురం.!

సిటీబ్యూరో: దీపావళి వేడుకలు గురువారం అంగరంగ వైభవంగా జరిగాయి. నివాసాలన్నీ కాంతులతో విరజిమ్మాయి. ప్రమిదల వెలుగులతో నగరమంతా కొత్త శోభను సంతరించుకుంది. కొత్త దుస్తులు ధరించి.. చిన్నా పెద్ద అందరూ ఉత్సాహంగా గడిపారు. పటాకులు పేల్చుతూ మురిసిపోయారు. బంధువులు, స్నేహితులు మిఠాయిలు పంచుకుంటూ ఆత్మీయంగా గడిపారు. దివాళితో మిఠాయి, పటాకుల దుకాణాలు వినియోగదారులతో కళకళలాడాయి. మరోవైపు వ్యాపారులు తమ దుకాణాలను అందంగా ముస్తాబు చేసి, లక్ష్మీ పూజలు నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి బాణాసంచా కాల్చారు. శుక్రవారం కూడా ప్రమిదిల వెలుగులతో నగరం అందంగా ముస్తాబైంది. నిరుపేదల పిల్లలతో సామాజిక సేవా సంస్థలు దిపావళి వేడుకలు జరిపాయి. జగతి ఫౌండేషన్, స్కై ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో పిల్లలకు పటాకులు పంచి సంతోషాన్ని నింపారు.

సమగ్ర సర్వేను పక్కాగా చేపట్టాలి

రాష్ట్ర పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్

సిటీబ్యూరో, నవంబర్ 1(నమస్తే తెలంగాణ): వందశాతం ఖచ్చితత్వంతో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల, సర్వేను సమగ్రంగా చేపట్టాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిశోర్ సూచించారు. ఖైరతాబాద్ జోన్‌లో చేపట్టనున్న సమగ్ర ఇంటింటి సర్వేపై సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లకు శుక్రవారం బంజారాహిల్స్‌లోని గౌరీశంకర్ కమ్యూనిటీ హాల్‌లో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన దానకిశోర్ మాట్లాడుతూ.. నవంబర్ 6 నుంచి ప్రారంభమయ్యే సర్వేలో వివిధ వర్గాల ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. గ్రేటర్ పరిధిలో సర్వేను చేపట్టేందుకు 21వేల మంది ఎన్యూమరేటర్లను వినియోగించుకుంటున్నామన్నారు. సమగ్ర సర్వే ద్వారా ప్రభుత్వ పథకాలు చిట్టచివరి పేదవారికి చేరేందుకు దోహదపడుతాయన్నారు. సర్వే వివరాలు నమోదు చేసేందుకు వీలుగా ప్రతి ఎన్యూమరేటర్ జిరాక్స్ సర్వే పత్రాలతో ప్రాక్టీస్ చేసేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లేక్స్ అదనపు కమిషనర్ కె.శివకుమార్ నాయుడు, జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, అడిషనల్ కమిషనర్లు స్నేహ శబరీశ్, చంద్రకాంత రెడ్డి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

చౌటుప్పల్ రూరల్ : మండలంలోని ఆరెగూడెం గ్రామంలో ఎన్నంపల్లి వజ్రమ్మకు రూ.15వేలు, కొలను శంకరయ్యకు 60వేలు, ఎన్నంపల్లి కలమ్మకు 27వేల రూపాయలు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరయ్యాయి. ఆ చెక్కులను శుక్రవారం గ్రామ శాఖ నాయకులు అందజేశారు. రిలీఫ్ ఫండ్ వచ్చేలా సహకారం అందించిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సామ వెంకట్‌రెడ్డి, బద్దం నరేశ్, పిన్నింటి మధుసూదన్‌రెడ్డి, మారసాల శ్రీకాంత్, శ్రీశైలం పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి

బీబీనగర్, నవంబర్ 1 : విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృత్యువాత పడ్డాయి. మండలంలోని మక్తానంతారం గ్రామంలో రైతు బింగి శ్రీశైలానికి చెందిన రెండు గేదెలు శుక్రవారం వ్యవసాయ పొలం వద్ద మేతకు వెళ్లాయి. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలకు తగిలి మృత్యువాత పడ్డాయి. వాటి విలువ సుమారు రెండు లక్షల వరకు ఉంటుందని బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం, అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని రైతు శ్రీశైలం కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రాజాపేట, నవంబర్ 1 : మండలంలోని బేగంపేట వాగులో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఉపేందర్ యాదవ్ తెలిపారు.

భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న సిరికొండ

చార్మినార్‌లోని భాగ్యలక్ష్మి అమ్మవారిని దీపావళి పర్వదినం సందర్భంగా తెలంగాణ శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనా చారి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆయనకు అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు.

– సిటీబ్యూరో, నవంబర్ 1(నమస్తే తెలంగాణ)

ఫోర్జరీ సంతకాలు.. నకిలీ పత్రాలతో బోగస్ లే అవుట్లు

- వట్టినాగులపల్లిలో ప్లాట్ల పేరుతో రూ.1.45 కోట్లు వసూలు
- సాయిసూర్య డెవలపర్స్ ప్రొప్రైటర్ అరెస్ట్

సిటీబ్యూరో, 1 నవంబర్ (నమస్తే తెలంగాణ): ఫోర్జరీ సంతకాలు, నకిలీ పత్రాలతో లేని లేఅవుట్‌ను సృష్టించి.. ప్లాట్ విక్రయం పేరుతో ఒక వ్యక్తి నుంచి రూ.1.45 కోట్లు వసూలు చేసి, రిజిస్ట్రేషన్ చేయకుండా మోసం చేసిన సాయిసూర్య డెవలపర్స్ ప్రొప్రైటర్‌ను సైబరాబాద్ ఆర్థిక నేర విభాగం పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఈఓడబ్ల్యూ డీసీపీ కె.ప్రసాద్ కథనం ప్రకారం.. నెల్లూరుకు చెందిన కంచర్ల సతీశ్ చంద్ర గుప్తా ఉపాధి కోసం నగరానికి వలసొచ్చి గచ్చిబౌలి రాయదుర్గంలో నివాసం ఉంటున్నాడు. సాయిసూర్య డెవలపర్స్‌కు ప్రొప్రైటర్‌గా వ్యవహరిస్తున్న సతీశ్ చంద్రగుప్తా.. భాగ్యనగర్ ప్రాపర్టీస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ నరేందర్ సురానాతో కలిసి వట్టినాగులపల్లిలో ఫోర్జరీ సంతకాలు, నకిలీ పత్రాలతో సాయి తులసి ఎన్‌క్లేవ్–4, శణ్ముక నివాస్ పేర్లతో లే అవుట్లను సృష్టించారు. ఈ లేఅవుట్‌లో ఒక ప్లాట్‌ను రూ.3.25 కోట్లకు విక్రయించేందుకు సతీశ్ చంద్రగుప్తా నాచారం ప్రాంతానికి చెందిన పోతుగంటి గోపాల్‌రెడ్డితో ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఒప్పందంలో భాగంగా గోపాల్‌రెడ్డి వద్ద నుంచి రూ.1.45 కోట్లు అడ్వాన్స్‌గా తీసుకున్నాడు. కానీ, రోజులు గడుస్తున్నా ప్లాట్‌ను రిజిస్ట్రేషన్ చేయకుండా తప్పించుకు తిరుగుతున్న సతీశ్‌చంద్రపై బాధితుడు గోపాల్‌రెడ్డి సైబరాబాద్ ఈఓడబ్ల్యూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన ఈఓడబ్ల్యూ ఇన్‌స్పెక్టర్ జె.వెంకటేశ్వర్లు దర్యాప్తు చేపట్టి, నిందితుడిని శుక్రవారం అరెస్టు చేశారు.

అప్రమత్తంగా ఉండాలి: ఈఓడబ్ల్యూ డీసీపీ ప్రసాద్

నకిలీ పత్రాలు, కల్పిత లేఅవుట్లతో కొన్ని రియల్ ఎస్టేట్ సంస్థలు అమాయక ప్రజలను మోసగిస్తున్నాయని, అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఈఓడబ్ల్యూ డీసీపీ ప్రసాద్ ప్రజలను హెచ్చరించారు. ప్లాట్లు, స్థలాలు కొనుగోలు చేసే ముందు వాటికి సంబంధించిన పత్రాలను సంబంధిత శాఖల నుంచి తెలుసుకోవాలన్నారు. ఆ తర్వాతే కొనుగోలుకు సంబంధించిన లావాదేవీలు జరపాలన్నారు.

అసంఘటిత రంగంలోని మహిళల సమస్యలపై ఉద్యమిస్తాం

ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షులు కృష్ణమూర్తి

జ్యోతికి నియామకపత్రాన్ని అందజేస్తున్న కృష్ణమూర్తి

ఖైరతాబాద్, నవంబర్ 1 : దేశంలోని శ్రామికశక్తిలో 30 శాతం మంది మహిళలు పనిచేస్తున్నారని, అందులో 85 శాతం మంది అసంఘటిత రంగంలో ఉన్నారని, వారి సమస్యలపై ఉద్యమాలు చేస్తామని ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షులు అంబటి కృష్ణమూర్తి అన్నారు. ఖైరతాబాద్‌లోని ఐఎన్‌టీయూసీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలిగా నియమితులైన నర్సేటి జ్యోతికి నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సమావేశంలో సంఘం జాతీయ ఉపాధ్యక్షులు పులిపాటి సత్యదేవ్, జాతీయ కార్యదర్శి ఎస్. రాజలింగం, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్. రాజు, కార్యనిర్వాహక కార్యదర్శి నాగరాజు, ఆనంద్, లలిత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

న్యాక్‌లో ఇంటీరియర్ డిజైనింగ్ కోర్సు అడ్మిషన్లు ప్రారంభం

మాదాపూర్, నవంబర్ 1: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) ఆధ్వర్యంలో జనరల్ కేటగిరీలోని ఇంటర్‌మీడియట్, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ అర్హతతో 6 నెలల ప్లేస్‌మెంట్ లింక్డ్ పేమెంట్ ఇంటీరియర్ డిజైనింగ్ కోర్సుకు సంబంధించి అడ్మిషన్లను న్యాక్ సంస్థ ప్రారంభించింది. శిక్షణలో చేరడానికి ఆసక్తి గల అభ్యర్థులు కోర్సు ఫీజు, ఇతర వివరాలకు 9063208703లో సంప్రదించాలని సూచించారు.

జల్సాల కోసం గంజాయి బాట

పోలీసులకు చిక్కి కటకటాలపాలైన నిందితులు

జీడిమెట్ల, నవంబర్ 1: జల్సాల కోసం గంజాయి స్మగ్లింగ్ బాటను ఎంచుకొని పోలీసులకు చిక్కారు. శుక్రవారం బాలానగర్ డీసీపీ కార్యాలయంలో డీసీపీ సురేశ్‌కుమార్ ఈ వివరాలను వెల్లడించారు. నల్గొండ జిల్లాకు చెందిన సభావత్ సుమన్, రమావత్ లాల(38), కేతావత్ విజయ్‌కుమార్(32) పాత నేరస్తులు. సుమన్ వైజాగ్ జైలులో ఉన్న సమయంలో ఒడిశాకు చెందిన కిరణ్‌తో పరిచయం ఏర్పడింది. గత నెల అక్టోబర్ 27న సుమన్, విజయ్, లాలు ముగ్గురు కలిసి పల్సర్ బైక్‌పై దేవరకొండ నుంచి ఏపీలోని అల్లూరి జిల్లా పాడేరుకు వెళ్లారు. అక్కడ వీరికి ఒడిశాకు చెందిన కిరణ్ 2.500 లీటర్ల హాష్ ఆయిల్‌ను అందజేశాడు. ఈ ముగ్గురు కలిసి నంబర్ ప్లేట్ లేని పల్సర్ వాహనంపై హాష్ ఆయిల్‌ను తీసుకొని 31న హైదరాబాద్‌కు చేరుకున్నారు. అదే రోజు బాలానగర్‌లోని విమల్ థియేటర్ వద్ద ఆయిల్‌ను విక్రయించేందుకు సిద్ధమయ్యారు. విశ్వసనీయ సమాచారం మేరకు బాలానగర్ ఎస్‌ఓటీ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఎస్‌హెచ్‌ఓ నరసింహారాజు, సిబ్బంది చాకచక్యంగా ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 13 లక్షల 50 వేల విలువజేసే హాష్ ఆయిల్, పల్సర్ బైక్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

దీపావళి పండుగలో అపశృతి

పటాకులతో వేర్వేరు చోట్ల 64 మందికి కాలిన గాయాలు

సరోజినీ కంటి దవాఖానకు క్యూ కట్టిన బాధితులు

మెహిదీపట్నం, నవంబర్ 1: దీపావళి పండుగలో అపశృతి చేటుచేసుకుంది. పటాకులు కాల్చుతూ వేర్వేరు చోట్ల పలువురు కాలిన గాయాలకు గురయ్యారు. దీంతో బాధితులు సరోజినీ కంటి దవాఖానకు క్యూ కట్టారు. వివరాల్లోకి వెళితే.. దీపావళి పండుగ సందర్భంగా గురువారం నాడు వేర్వేరు చోట్ల పటాకులు కాల్చుతూ పలువురు కాలిన గాయాలకు గురయ్యారు. కంటికి కాలిన గాయాలైన వారికి సరోజినీ దేవి కంటి దవాఖానలో చికిత్స అందిస్తున్నారు. గురువారం నుంచి శుక్రవారం సాయంత్రం వరకు బాధితుల సంఖ్య 64కు చేరినట్లు సరోజినీ కంటి దవాఖాన వైద్యులు తెలిపారు. బాధితుల్లో 30 మంది పిల్లలు ఉన్నట్టు తెలిపారు. బాధితులు 64 మందిలో 50 మంది నగరానికి చెందిన వారు కాగా.. మిగిలిన 14 మంది ఇతర జిల్లాలకు చెందిన వారని సరోజినీ వైద్యులు వెల్లడించారు. కంటికి కాలిన గాయాలైన బాధితుల్లో 54 మందికి ఓపీలో చికిత్స అందించామన్నారు. మరో 10 మందిని అబ్జర్వేషన్ కోసం దవాఖానలో అడ్మిట్ చేసుకుని, వారిలో 9 మందిని శుక్రవారం సాయంత్రం డిశ్చార్జి చేసినట్లు వైద్యులు తెలిపారు. కాగా, జీడిమెట్లకు చెందిన సత్తయ్యకు కంటి శస్త్ర చికిత్స జరిపినట్లు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు సరోజినీ దవాఖాన సూపరింటెండెంట్ డా.మోదిని వెల్లడించారు.

హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలి: ఆర్ కృష్ణయ్య

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్, నవంబర్ 1: ప్రభుత్వం హాస్టల్ విద్యార్థులకు సొంత భవనాల నిర్మించి, స్కాలర్ షిప్‌లు రూ.20 వేలకు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అద్దె భవనాల్లో కొనసాగుతున్న హాస్టళ్లకు సంబంధించి అద్దె చెల్లించడం లేదని, భవన యజమానులు ఖాళీ చేయాలని ఒత్తిడి తెస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలోని 295 బీసీ కాలేజీల హాస్టళ్లకు, 321 గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు లేవన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సొంత భవనాలు నిర్మించాలని కోరారు. గురుకుల, హాస్టల్‌లో చదువుకునే విద్యార్థుల మెస్ చార్జీల పెంపు పట్ల హర్షం వ్యక్త చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు గుజ్జ కృష్ణ, నీల వెంకటేశ్, మల్లేశ్ యాదవ్, సుధాకర్, నంద గోపాల్, అనంతయ్య, ఉదయ్, రవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆడుకుంటూ భవనం పైనుంచి పడిన చిన్నారి

చికిత్స పొందుతూ మృతి

బంజారాహిల్స్, నవంబర్ 1: ఆడుకుంటూ వెళ్లి భవనం పైనుంచి కిందపడిన మూడేండ్ల చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. టోలీచౌకి సమీపంలోని మినీ జానకీనగర్‌లో నివాసముంటూ మౌజెన్‌గా పనిచేస్తున్న మహ్మద్ అక్లాస్, బ్యూటీ పర్వీన్ దంపతులకు ఇద్దరు పిల్లలు. పెద్ద కుమార్తె ఉమ్మె సారా (3) గత నెల 24న రెండో అంతస్థులోని బాల్కనీలో ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సాయంతో చిన్నారిని ఆలివ్ ఆస్పత్రిలో చేర్పించారు. చిన్నారి పరిస్థితి విషమించడంతో రెండ్రోజుల తర్వాత ప్రీమియర్ ఆస్పత్రికి తరలించారు. చిన్నారి తలకు బలమైన గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం నాంపల్లిలోని గ్లెన్ ఫీల్డ్ మల్లారెడ్డి బ్రెయిన్ అండ్ హార్ట్ ఆస్పత్రిలో చేర్చారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆ చిన్నారి రెండ్రోజుల కిందట మృతి చెందింది. తండ్రి మహ్మద్ అక్లాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హైడ్రా వద్దకు అమీన్‌పూర్ బాధితులు

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేస్తున్న అమీన్‌పూర్ బాధితులు

సిటీబ్యూరో, నవంబర్ 1(నమస్తే తెలంగాణ): అమీన్‌పూర్ ఏరియాలో తమకు అన్యాయం జరిగిందంటూ శుక్రవారం హైడ్రా కార్యాలయంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు పలువురు స్థానికులు ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 6 అనుమతులు చూపించి.. సర్వే నంబర్ 12కు చెందిన ప్రభుత్వ భూమిని మాధవరెడ్డి, కోటేశ్వర్‌రావు, చంద్రశేఖర్ అనే వ్యక్తులు ప్లాట్లుగా చూపించి తమను మోసం చేసి విక్రయించారంటూ కొందరు ఫిర్యాదు చేశారు. రద్దయిన అనుమతుల విషయాన్ని బయటకు చెప్పకుండా విక్రయించారని, తమను మోసం చేసి అమ్మిన వ్యక్తుల నుంచి నష్టపరిహారం ఇప్పించాలని హైడ్రా కమిషనర్‌ను కోరారు. అమీన్‌పూర్ మండలంలోని పెద్ద చెరువు అలుగులు మూసేసి, ఎగువవైపు తమ స్థలాల్లోకి నీరు వచ్చేలా చేశారని, పెద్ద చెరువు నీరు దానికింద ఉన్న బండికుంట చెరువుకు వెళ్లేలా కాకుండా.. అలుగులు మూసేయడంతో ఎగువవైపు నీరుపారి ఇండ్ల స్థలాలు కోల్పోయామంటూ కమిషనర్‌కు మరికొందరు ఫిర్యాదు చేశారు. సర్వేనంబర్ 153లో హుడా అనుమతి పొందిన లే అవుట్లలో ఉన్న పార్కు స్థలం పక్కనే కొత్తగా వెంచర్ చేస్తున్న వారు కబ్జా చేశారంటూ వెంకటరమణకాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులన్నీ పరిశీలించిన కమిషనర్ రంగనాథ్.. వీటిపై విచారణ జరిపిస్తామని, సమగ్ర సర్వే జరిపి న్యాయం జరిగేలా చూస్తామని చెప్పారు.

స్కందగిరి ఆలయానికి చేరుకున్న శ్రీరామ యంత్రం రథయాత్ర

పద్మారావునగర్‌లోని స్కందగిరి ఆలయానికి చేరుకున్న 'శ్రీరామ యంత్రం' రథం

బన్సీలాల్‌పేట, నవంబర్ 1: 'శ్రీరామ యంత్రం' రథయాత్ర గురువారం రాత్రి పద్మారావునగర్‌లోని శ్రీ స్కందగిరి సుబ్రహ్మణ్య స్వామి ఆలయానికి చేరుకున్నది. ఆలయ కమిటీ చైర్మన్, మాజీ ఐఎస్ అధికారి ఎల్వీ సుబ్రహ్మణ్యం, మేనేజింగ్ ట్రస్టీ కృష్ణన్ రాజమణి, ఆలయ వేద పండితులు స్వాగతం పలికారు. కంచి పీఠాధిపతి జగద్గురు శ్రీ విజయేంద్ర సరస్వతి గత నెల 27న తిరుపతిలో ప్రారంభించిన ఈ రథయాత్ర ఐదు రాష్ట్రాలు పర్యటించి, నవంబర్ 16 నాటికి అయోధ్యలోని రామ మందిర క్షేత్రానికి చేరుకుంటుంది. శుక్రవారం ఆలయ కల్యాణ మండపంపై ఏర్పాటు చేసిన శ్రీరామ యంత్రానికి పూజలు చేశారు. శ్రీరామ యంత్రాన్ని భక్తులు దర్శించుకున్నారు. శనివారం సాయంత్రం రథయాత్ర బయలుదేరి యాదాద్రి ఆలయానికి చేరుకుంటుందని నిర్వాహకులు తెలిపారు.

నార్సింగిలో హోరెత్తిన సదర్ సంబురాలు

సమైక్యతకు నాంది సదర్ ఉత్సవాలు: ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

నార్సింగిలో జరిగిన సదర్ ఉత్సవాల్లో పాల్గొని మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ, నవంబర్ 1: సమాజంలో సమైక్యతకు నాందీగా సదర్ ఉత్సవాలు కొనసాగుతున్నాయని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని నార్సింగిలో గురువారం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ వెంకటేశ్ యాదవ్ నేతృత్వంలో నిర్వహించిన సదర్ ఉత్సవాలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా దున్నపోతుల విన్యాసాలు, ఆటాపాటలతో హోరెత్తించారు. హాకీ స్టిక్కు చేత బూని దున్నలను ఆడిస్తూ ఆనందోత్సవాల మధ్య సదర్ ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిన్న శ్రీశైలం యాదవ్, మాజీ మేయర్ మహేందర్ గౌడ్, మాజీ ఎంపీపీ మల్లేశ్, మాజీ సర్పంచ్ నర్సింహ, నాయకులు హరిశంకర్, యాదవ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వేడుకగా సదర్

ఖైరతాబాద్, నవంబర్ 1: ఖైరతాబాద్‌లో సదర్ వేడుకలు అంబరాన్నంటాయి. నవయుగ యాదవ సంఘం, చౌదరి యాదయ్య యాదవ్ అండ్ బ్రదర్స్ సంయుక్తాధ్వర్యంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన ఈ వేడుకల్లో పంజాగుట్ట, సోమాజిగూడ, ఆనంద్‌నగర్‌కాలనీ, చింతలబస్తీ, దోమలగూడ, పురానాపూల్ తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా అలంకరించిన దున్నపోతలతో విన్యాసాలు నిర్వహించారు. అనంతరం రైల్వే గేటు నుంచి బడా గణేశ్ ప్రాంగణం వరకు నిర్వహించిన దున్నపోతుల ర్యాలీ ఆకట్టుకున్నది. ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, పాడి కౌశిక్ రెడ్డి, ఎంపీ అనిల్‌కుమార్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నవయుగ యాదవ సంఘం ప్రతినిధులు ఎం.రాజు యాదవ్, ఎం.మహేశ్ యాదవ్, మల్లికార్జున యాదవ్, మధుకర్ యాదవ్, ప్రసాద్ యాదవ్, మనోజ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

స్థలం కేటాయింపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఉద్యోగుల ఆందోళన

బంజారాహిల్స్, నవంబర్ 1: జూబ్లీహిల్స్‌లోని డా.బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి చెందిన 10ఎకరాల స్థలాన్ని జేఎన్ఏఫ్ఏయూకు కేటాయించడాన్ని నిరసిస్తూ యూనివర్సిటీ ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనకు అన్ని వర్గాల నుంచి మద్దతు లభిస్తోంది. ఇప్పటికే మాజీ ఉద్యోగులు ఆందోళనలో పాల్గొని ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాజాగా, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆవరణలోని సీఎస్‌టీడీ ఉద్యోగులు కూడా శుక్రవారం ఆందోళనకు మద్దతు పలికారు. మధ్యాహ్న భోజన విరామసమయంలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ జేఏసీ చేపట్టిన నిరసన ప్రదర్శనలో సీఎస్‌టీడీ డైరెక్టర్ ప్రొ.ఆనంద్ పవార్‌తో పాటు ఇతర ఉద్యోగులు పాల్గొని ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ ప్రొ. వడ్డాణం శ్రీనివాస్, ప్రొ.పుష్పా చక్రపాణి, డా. బి.శ్రీనివాస్, డా. దయాకర్, డా.అంబేద్కర్, డా.ప్రమీల కేతావత్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో తెరుచుకోనున్న తార్నాక జంక్షన్!

తప్పనున్న తిప్పలు



తార్నాక జంక్షన్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ట్రాఫిక్, జీహెచ్‌ఎంసీ అధికారులు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 1: తార్నాక జంక్షన్‌ను మూసివేసిన పోలీసులు.. స్థానికుల ఫిర్యాదు మేరకు ఎట్టకేలకు దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టారు. ఇందుకు జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ప్రణాళికలను రూపొందిస్తున్నారు. ట్రాఫిక్ అదనపు కమిషనర్ పి. విశ్వప్రసాద్, ట్రాఫిక్ డీసీపీ అశోక్‌కుమార్, ఏసీపీ సంపత్‌కుమార్, నల్లకుంట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికుమార్ తదితరులు తార్నాక జంక్షన్‌ను శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. జంక్షన్‌ను ఓపెన్ చేస్తే వచ్చే సమస్యలు, వాహనదారులకు జరిగే మేలు, తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. ఈ సందర్భంగా విశ్వప్రసాద్ మాట్లాడుతూ.. తార్నాక చౌరస్తాలో ఫ్లైఓవర్ ఉన్నప్పటికీ, సుమారు మూడు కిలోమీటర్లు మేరకు వాహనదారులు తిరగాల్సి వస్తోందని తమకు ఫిర్యాదులు అందాయని చెప్పారు. కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశాల మేరకు జంక్షన్‌ను ఓపెన్ చేసేలా.. లేదా యూటర్న్‌ను తగ్గించేందుకు చర్యలు తీసుకోనున్నట్టు వివరించారు. దీనికోసం అవసరమైతే బస్టాపులను మార్చాల్సి వస్తే మారుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇంజినీరింగ్ సెల్ ఇన్‌స్పెక్టర్లు భరత్‌కుమార్, కోటేశ్వరరావు, నల్లకుంట ట్రాఫిక్ ఏఎస్సై వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.